అంతర్యాలు

కల్యాణి

నీకేమయినా కృతజ్ఞత అన్నది ఉంటేగా? ఛ! నా మెడకో గుదిబండలా తగలడ్డావు. ఇంతకీ నేను వెళ్ళాక సింగారించుకుని కిటికీ దగ్గర నిలబడకు. 'ఏపాపి కొంపో అనుకోగలరు' అంటూ తలుపు ఛళ్ళున వేసుకుని వెళ్ళిన భర్తను చూస్తూ మంచం మీద నిర్వికారంగా కూర్చుండిపోయింది కమల.

పదేళ్ళ అతనితో కాపరం చేశాక అతని మాటలకు బాధపడే శక్తిని కోల్పోయిందామె. పదేళ్ళ క్రితం అయితే, అతనలాటి మాట అంటే తెగబాధ పడిపోయేది. మళ్ళీ అతను చిరునవ్వుతో పలకరించే వరకూ ఏడుస్తూ కూర్చునేది. అతనువచ్చి 'ఏం దుఃఖ కమ్మా, అలా ఉన్నావేం? తోటలోకి వెడదామా?' అనేసరికి చిరునవ్వుతో అతన్ని ఎదుర్కొనేది. అతను నవ్వుతూ, ఆనందంగా, ఆప్యాయంగా పలకరిస్తే ఆమె ఎంతో సుఖంగా నవ్వుతూ ఉండేది. లేకపోతే లేనిపోని ఆలోచనలతో సతమతమయ్యేది.

పదేళ్ళ క్రితం.....

కమల అప్పట్లో ఇంటర్ చదువుతుండేది. సూర్యం వాళ్ళ పక్కింటి అబ్బాయి. చిన్నప్పటినుండి ఒకరి కొకరు బాగా తెలుసు. అతనామెకు మంచి స్నేహితుడు. అప్పట్లో కమలకు ఇంకే విషయంలో కొరత లేక పోయినా ఒక్క విషయం తల్చుకుని చాలా బాధ పడేది. కమల మరీ కురూపికాదుకాని, అందగత్తె మటుకుకాదు. నలుగురిలో ఎత్తి కనిపించే వ్యక్తిత్వం అసలేకాదు. చిన్నప్పటినుండి తమ అక్క చెల్లెళ్ళలో అందర్లో అందంగా ఉన్న చెల్లెలు విమలతో తన్ని పోల్చుకుని బాధ పడేది. అందర్లోకి అందంగా ఉన్న చెల్లెలు తన పాటలతో, మాటలతో అందర్నీ తన చుట్టు తిప్పుకునే విమల్ని తన్నూ పోల్చుకుని 'నేను అలా లేనే' అని కుమిలి పోయేది. అందులోను ఇంట్లో వాళ్ళు తన పెళ్ళికి ఎంత కట్నం ఇవ్వాలి? కట్నం ఇచ్చినా పెళ్ళికావటం ఎంత కష్టం అనుకుంటూంటే విని ఏదో రకమయిన ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుని పెంచుకుంది. ఎప్పుడయినా శెలవుల్లో, సాయంకాలాల్లో ఇంట్లో ఉంటే ఇలాంటి మాటలు వినాలన్న భయంతో పక్కింటికి పారిపోయేది.

అలాటి సమయంలో చనువుగా, స్నేహపూర్వకంగా మాటాడే సూర్యం చాలా ఆత్మీయుడుగా కనపడ్డాడు. ఎన్ని రోజులుగానో అణిచిపెట్టుకున్న బాధ అంతా ఒకరోజు అతనితో చెప్పింది. ఆ రోజున కమల తల్లి భర్తకు మధ్యాహ్నం కాఫీ ఇస్తూ,

'ఏమండీ, కమలకేమయినా సంబంధాలు చూశారా?' అని కమల పెళ్ళిమాట ఎత్తారు.

'చూడు, విమలకు పెళ్ళి చేయమంటే ఈ నెల్లో చెయమన్నా చేసేస్తాను. కమలకంటావా నేనేం చెప్పలేను. దాని అందంచూసి, మనం ఇవ్వబోయే ముష్టి రెండువేలు కట్నం చూసి ఏ వరు

తోస్తాడు చెప్పు?'

ఇంతవరకూ విన్న కమల ఇక అక్కడ ఉండలేక పక్కింటికి పారిపోయింది. ఏదో పత్రిక తిరగేస్తున్న సూర్యం కమల్ని చూడగానే—

'అదేమిటి కమలా అలా ఉన్నావ్, ఏమయింది?' అంటూ లేచి దగ్గరకొచ్చాడు. ఎన్నేళ్ళగానో ఎవరితోనూ చెప్పుకోకుండా దాచుకున్న దుఃఖమంతా ఒక్క మారుగా పొంగివచ్చింది.

'ఈ బాధ నేను పడలేను సూర్యం. నా అనాకారితనం నన్ను మాత్రమే బాధపెట్టేలా అయితే పర్వాలేదు సూర్యం. కాని నా గురించి అమ్మా, నాన్న ఎంతబాధ పడ్డారు. ఇంకెంత కాలం నాకు చదువు చెప్పించగలరు? ఈ ఇంటర్, బియ్యేనో అయ్యాక పెళ్ళి చేయక తప్పదు. కాని నాలో ఏముందని ఎవరయినా నన్ను పెళ్ళి చేసుకోవటానికి ఇష్టపడతారు చెప్పు? నాకున్న పాటి చదువు ఎంతోమంది అమ్మాయిలకుంటుంది. అందమా? డబ్బా? నేను చచ్చిపోతే ఎవరికీ ఏ సమస్యా ఉండదు' అంటూ కమల చేతుల్లో మొహం దాచుకుని ఏడవసాగింది.

'అదేంమాట కమలా? నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. చావు మాట మరిఎత్తకు. నువు అందంగా లేవు. నీకు డబ్బులేదు. అంతా నిజమే. అయినా నిన్నే పెళ్ళి చేసుకుంటాను నేను. నీకీబాధ తప్పించటానికి ఎలాంటి త్యాగమయినా చేస్తాను కమలా' అని సూర్యం అనేసరికి కమల విస్తుపోయింది. ఒక్క నిముషం అది కలా, నిజమా అనిపించింది. రాత్రి చీకట్లో తోవతప్పిన మనిషికి దూరాన కనిపించే వెలుగు, అది ఏదయినా ఇంటి దీపమన్న నమ్మకం చిక్కనట్టే, కమలా అతని మాటల్ని నమ్మలేక పోయింది. ఆ అపనమ్మకంతోనే—

'నిజంగానే అంటున్నావా సూర్యం. నా కోసం అంత త్యాగం చేయటానికి సిద్ధంగా ఉన్నావా? అయినా ఒక్కమారు ఆలోచించు. నేను కాకపోతే నీకు ఎంతో అందమూ, డబ్బూ ఉన్న అమ్మాయి దొరకవచ్చును' అంది.

'నిజమే. కాని నేను నిన్నే పెళ్ళి చేసుకుంటాను. అయితే ఇప్పట్నుంచీ ఈ విషయం వూళ్ళో అంతా చాటకుమీ. నా ఎం. ఎస్సీ అయిపోనీ. తర్వాత ఇంట్లో చెబుతాం. మా ఇంట్లో వాళ్ళేలాగా వద్దనరు. నీకు, ఇంత చదువుకున్న అందమయిన అబ్బాయి దొరికితే అదే తమ పుణ్యం అనుకుంటారు. మా ఇంట్లో వారితో దెబ్బలాడాల్సి వస్తే దెబ్బలాడతాను. ఇక ఏడవకు మరి. ఎవరో కొంతమంది అమ్మాయిలే ఏడిస్తే బావుంటారు.'

అలా ప్రారంభమయింది వారి ప్రేమ వ్యవహారం. అతన్ని ఓ రకంగా ఆరాధించేది కమల. కమలకంతవరకు పెద్దగా అబ్బాయిలతో పరిచయం లేదు. పరిచయమున్న సూర్యం ఆమెకు ఆరాధ్య దేవత అయ్యాడు. అతను ఏ లోపమూలేని దేవుడిలా అగుపించేవాడామెకు.

ఆ తరువాత రెండేళ్ళ వరకూ భూమిమీద నిడవలేదామె. అదేదో తెలీని ఉత్సాహం ఆమెను సదా సంతోషంగా ఉండేలా చేసింది. ఆమెలో పొంగిపొరలే ఉత్సాహాన్ని చూసి ఇంట్లో అందరూ విస్తుబోయారు. అది వేసంగి కావటం మూలాన్న తరచు సూర్యాన్ని కలుసుకోగలిగేది ఆమె. ఎన్నోపేమార్లు.

'నిరాశతో చావాలని ఉన్న నన్ను దేవుడిలా వచ్చి ఆదుకున్నావు సూర్యం' అనేది కృతజ్ఞతతో. అతను ఓ చిరునవ్వు నవ్వి వూరుకునేవాడు..

'అలా నవ్వుతూంటే అచ్చం దేవానంద్‌లా ఉన్నావ్ సూర్యం' అనేది కమల అతన్ని ఆరాధనా భావంతో చూస్తూ.

ఆ సంవత్సరం అతను ఎం. ఎస్సీ చదవటానికి వాల్తేరు వెళ్ళాడు. అతను వెళ్ళాక కమల చాలా బెంగపెట్టేసుకుంది. అంతవరకు ఏమీకాని వ్యక్తి ప్రేమ అన్న భావన కలిగేసరికి ఎంత దగ్గరవాడయిపోయాడు. అని ఆశ్చర్యపోయిందామె. రెండు రోజులకోమారు ఉత్తరం రాసేదతనికి. వాటిలో అతన్ని తనెంతలా ఆరాధిస్తోందో అతను తన దగ్గర లేకపోతే ఎంత బాధగా ఉందో రాసేది.

'ఇంతకుముందు జీవితం చాలా నీరసంగా అనిపించేది సూర్యం. కాని దానిలో ఇంత ఉత్సాహాన్ని నింపి, జీవితాన్ని ఆనందదాయకమనిపించేలా చేసి వెళ్ళిపోయావు. నిన్ను చూడకుండా, నీమాటలు వినకుండా ఎలా ఉండను సూర్యం? ఇంతకీ ఎప్పుడొస్తావు?'

'నీకు సెలవులెప్పుడొస్తాయో అని ఎదురు చూడటంలోనే నా సమయమంతా గడుస్తోంది. ఇప్పుడెవరైనా 'ఏమిటి బాబూ, ఇంత అసహ్యంగా కనిపిస్తున్నావు' అని అన్నా మునుపటిలా బాధపడటంలేదు. నా సూర్యానికి నేను బావున్నాననిపిస్తే చాలు. మిగిలిన వాళ్ళకళ్ళకెలా కనిపిస్తేనేం? అయినా ప్రేమకూ, అందానికీ సంబంధమేమిటి చెప్పు? ఉట్టి ఆకర్షణే అయితే అప్పుడు అందం ప్రశ్న వస్తుంది. ఇంతవరకూ ఎవరికీ కనిపించని అందం నీకు కనిపించిందంటే దానికి కారణం నీకళ్ళే. అవునా ?'

'చిన్నప్పటినుండీ కని, పెంచిన తల్లీ, అమితంగా ప్రేమించే నాన్నా, అక్కా, అక్కా అంటూ దగ్గరకొచ్చే చెల్లీ, తమ్ముడూ అందరూ ఇప్పుడు దూరమయ్యారు. నీకోసం వీళ్ళనందర్నీ వదులుకుని వచ్చేయటానికి సిద్ధంగా ఉన్నాను. నువ్వు తోడుగా ఉన్నావంటే ఎలాంటి చీకట్లోనయినా నిర్భయంగా నీవెంట వచ్చేయగలను.'

అలా, అలా ఎన్నో ఉత్తరాలు రాసేది కమల. తన ఉత్తరాల్ని ఎంతో ఆత్రుతగా చదివి గర్వపడే వ్యక్తి ఒకడున్నాడన్న తలంపే ఎంతో సంతృప్తినిచ్చేదామెకు.

ప్రేమికులకు ప్రపంచమంతా అందంగా కనిపిస్తుందంటారు కాని కమల విషయంలో మటుకు అది నిజం కాలా. సూర్యం ప్రేమతో ఆమె సుఖి నిజమే. కాని ఆమె దుఃఖినికూడా. అతని ప్రతీ ఉత్తరం చదివేటప్పుడూ కన్నీరు కార్చేదామె. 'ఇంత ప్రేమిస్తాడు సూర్యం నన్ను, కాని నన్నిలా బాధించటంలో అతనికి కలిగే తృప్తి ఏమిటో' అనుకొనేది. అతనయి అతనే తను చేసిన పొరబాటును గుర్తించేవరకు ఇక ఉత్తరాలు రాయకూడదు అని గట్టిగా నిర్ధారించుకునేది. కాని ఆమె ఉత్తరం రాయటం ఒక్కరోజు ఆలస్యమయినా సరే ఉత్తరాల కోసం వేయికళ్ళతో ఎదురు చూసే ప్రాణి వాల్తేరులో ఉన్నడన్న విషయం మర్చిపోయావా తిరుగుటపాలో నీ ఉత్తరం వస్తుందని ఆశిస్తాను అన్న అతని ఉత్తరం ఆమె మనసులోని అనుమానాల్నంతా దూదిపింజెల్లా ఎగరగొట్టేసేది. వెంటనే ఓ నాలుగు కావులు ముందేసుకుని ఉత్తరం రాయటానికి కూర్చునేది.

వాల్తేరు వెళ్ళిన కొత్తలో సూర్యం ఓ ఉత్తరంతో—

కమలా,

ఇవాళ ఓ అందమయిన అమ్మాయిని చూశాను. ఎంత బావుందనుకున్నావ్. సన్నగా, పొడుగ్గా, పెద్ద పెద్ద కళ్ళతో బంగారు తీగలా ఉంది. ఆ అమ్మాయి పేరు లావణ్య చటర్జీ. నా క్లాసుమేటు. నేను కాలేజీకి వెళ్ళిన రెండో రోజునే ఆ అమ్మాయి నాదగ్గరకు వచ్చి 'మిస్టర్ రావ్, నేను సిలబస్ రాసుకోలేదు. మీ దగ్గరుంటే ఇస్తారూ? ప్లీజ్' అంది. ఆమె తియ్యటి కంఠం వింటూంటే అంతా మర్చిపోయాననుకో కమలా— నిన్నుకూడా. ఎంతటి అందం ఆ అమ్మాయిది. సల్వార్, కమీజు వేసుకొని ఆ అమ్మాయి నడుస్తూంటే...... నోహో ఆ అందాన్ని ఏమని వర్ణించను? ఇంతకీ అబ్బాయిలంతా లావణ్య నన్నే పలకరించినందుకు కంగ్రాచ్యులేట్ చేస్తూ ఏమిటన్నారో తెలుసా? ఇంతమంది అబ్బాయిల్లోకీ నన్నే పలకరించటానికి కారణం నా అందమట. నేను గ్రిగరీపెక్‌లా ఉంటానని అమ్మాయిలనుకొంటూంటే విన్నారట. మొత్తం మీద నా అందంతో యూనివర్శిటీలోని అమ్మాయిల్నంతా తిప్పుకోవచ్చని అంటున్నారు. చూడాలి మరి.....

వెంటనే ఉత్తరం రాస్తావు కదూ? నీ ఉత్తరం కోసమే ఎదురు చూస్తూంటా!

అని రాశాడు. తన గురించి ఒక్క ముక్కయినా లేకుండా అతను రాసిన ఆ ఉత్తరాన్ని చూసి ఆమె హృదయం అసూయతో భగ్గుమంది. మళ్ళీ ఉత్తరంలో కమల—

'నువ్వు లావణ్యని ప్రేమించటం లేదు కదా సూర్యం? అలాగే ఉంది నీ వాలకం చూస్తే. అలా మాత్రం చేయకు సూర్యం. నాకిప్పుడు ప్రపంచంలో మిగిలినది నువ్వొక్కడివే. మిగిలిన వారేమయినా, నువ్వొక్కడివీ నా వాడివిగా ఉన్నావన్న ఆశతో జీవిస్తున్నాను నేను. ఇకప్పుడు నువ్వు ఇంకా అందమయిన అమ్మాయిని చూసి 'ఆ అమ్మాయే కావాలినాకు. నువ్వొద్దు' అంటే నా గతేంకాను. ఎవరుకాదన్నా గోదావరి ఆశ్రయమిస్తుందిలే' అంటూ తన బాధనంతా వెళ్ళబోస్తూ సూర్యానికి ఉత్తరం రాసింది. సూర్యం జవాబుని విప్పి చదవటానికికూడా భయంవేసిందామెకు. దానితో తన జీవితం అటో ఇటో తేల్చేసే ముక్క ఉంటుంది. 'నీకు గోదావరే గతి' అంటే......

వణికిపోతూ ఆ ఉత్తరాన్ని విప్పింది. దానిలో రెండే పంక్తులు ఉన్నాయి.

'ఏది ఏమయినా నిన్నే పెళ్ళి చేసుకుంటాను. ఆ పోనీ చాలుగా. ఇక దేని గురించి పట్టించు

ఆంతర్యాలు

కాదు."

అదే ఆమెకు అమితానందాన్ని కలిగించింది. ఇక నాకు కావాల్సిందేమిటి అని తృప్తిగా నిట్టూర్చింది.

కాని ఆ తృప్తి ఎన్నో రోజులు నిలవలేదు. అప్పు డప్పుడు సూర్యం ఉత్తరాల్లోని కొన్ని వాక్యాలు ముళ్ళలా గుచ్చుకుంటూనే ఉన్నాయి. అలాంటి ఉత్తరాలు చదివి నప్పుడు ఆమెకు 'ఛ, సూర్యం ఇంత హీనంగా ఆలోచిస్తాడేమిటి? అనిపించేది. అయినా అతనంటే ఉన్న ప్రేమ ఆ భావాన్ని ఎక్కువ కాలం ఉండనీకా చేసేదికాదు. ఓసారతను—

'నువ్వు ఎప్పట్లాగే సింగారించుకుని కాలేజీకి వెళుతున్నావనుకుంటాను. అయినా నీకింకా చదువెం దుకు, ఎలాగయినా అందంగా కనబడి అబ్బాయిల్ని ఆకర్షించాలన్న లావణ్యదయం కాకపోతే? యూనివ ర్శిటీ అమ్మాయిల హీరోని నిన్ను పెళ్ళిచేసుకుంటా నన్నానుకదా, ఇంకా చదువెందుకు చెప్పు?' అని రాశాడు.

'అతనికీలాగానే నాకూ చదువు అవసరమని ఎందుకనుకోడు? నాకు కొత్తకొత్త విషయాలు తెలుసుకోవాలన్న కోరికా, నా పరిధిని పెంచుకోవా లన్న ఆకాంక్ష ఉండదని అనుకున్నాడా? లేక నేను ఏమీ తెలుసుకోనక్కర్లేదని అతని అభిప్రాయమా? అని ఓ రోజంతా బాధ పడింది. మళ్ళీ 'అబ్బేలేదు, నేను ఎండా, వానా అన్నవి లేకుండా ఇలా తిరగటం అతనికిష్టంలేదు' అని తన్నుతానే సమాధానపర్చు కుంది.

సూర్యం ఎదురుగుండా ఉన్నప్పుడు ఆమెకు ఇవేవి జ్ఞప్తికి వచ్చేవికావు. అతనిమీది ఆరాధనా భావంతో ఆమె హృదయం నిండిపోయేది కాని అతను వాల్తేరు వెళ్ళాక ఓ రకమయిన అశాంతితో చికాకు పడిపోయేది. ఒక్కోమారు ఆమెకు అను మానం వచ్చేది. 'నిజానికి సూర్యానికీ తనంటే అభిమానం ఉందా?' అని. అలా అనిపించినప్పుడే ఓసారతన్ని ఆ ప్రశ్న అడిగింది.

'చాలా పిచ్చిగా ఉంది నీ ప్రశ్న.' అని నవ్వి వూరు కున్నాడు అతను.

'నిజమే, అంతా నా పిచ్చిగాని, ఎందుకిలా ఆలో చిస్తున్నాను. నేనంటే ఎంత ఇష్టం లేకపోతే అం దర్నీ వదులుకుని అయినా నన్ను పెళ్ళి చేసుకోవటా నికి సిద్ధపడతాడు! సూర్యం నా వాడు. ఇంకే విష యం గురించి పట్టించుకోనక్కర్లేదు.' అని సంతృప్తి పడింది కమల.

ఆమె ఎంత సరిపుచ్చుకున్నా, ఎందుకో రోజులు గడుస్తున్న కొద్దీ— సూర్యం తనకు దూరమవు తున్నాడనిపించింది కమలకు. అతనంటే ఎంతో అభి మానం ఉందామెకు. అతను వూరికి వస్తున్నా డంటే సంతోషమే. కాని......

కాని ఇప్పుడు మొదటిలా వారానికి నాలుగు ఉత్తరాలు రాయాలని కాని లేకపోతే రెండురోజులు శెలవిచ్చినాసరే అతనువస్తే బావుండునన్న కోరికగాని లేవామెలో. అతని దగ్గర్నుండి జవాబు రావడం ఆలస్యమయినా మొదటిలా ఆవేదనలేదు. కాని ఆమె మొదటిలా ఉత్తరాలు తరచుగా వ్రాయకపోతే సూర్యానికి చాలా కోపం వచ్చేది. అలా కోపం వచ్చి నప్పుడు అతను రాసే ఉత్తరాలు చాలా బ్రూటల్‌గా ఉండేవి.

"నీకు నేనంటే లక్ష్యం లేదు. కృతజ్ఞత అసలే లేదు. లేకపోతే ఇంకో బాయ్‌ఫ్రెండ్ దొరికాడా? అయినా నీ మోహానికి బాయ్‌ఫ్రెండ్ కూడానా? ఎవడు ప్రేమిస్తాడు నిన్ను? వారానికి రెండు ఉత్తరా లల్లా నెలకురెండు చేశావేం? నీకు తెలుసుగా ఇలాంటి వన్నీ సహించి వూరుకునే వాడిని కానని. ఈ ఉత్త రం అందుకున్న వెంటనే జవాబురాయాలి నువ్వు. నీ ప్రత్యుత్తరం బుధవారంనాడు అందుతుంది. శుక్రవారం లోగా నీ ఉత్తరం క్షమాపణతోసహా నాకందాలి" అని.

ఆ ఉత్తరంతో కమలకు ఒక్కసారిగా అతనంటే ఏమిటో తెలిసినట్టయింది. అతనంటే ఓ రకమైన భావంతో మూసుకుపోయిన ఆమె కళ్ళు, అకస్మా త్తుగా తెరచుకున్నాయి. ఏదో సుందర స్వప్నంలో విహరిస్తున్న మనసు, మేలుకున్నాక, కనిపించే అతి హేయమయిన వాస్తవికతను చూసి బెదిరిపోయేలాగా ఆమె కూడా కొత్తగా కనిపిస్తున్న అతని రూపాన్ని వ్యక్తిత్వాన్ని చూసి బెదరిపోయింది. ఆ షాక్‌నుండి కొంచెం తేరుకున్నాక నెమ్మదిగా ఆలోచించసాగింది.

'ఇంతకీ అంటూయూ, అసల్తతా తేని తన్ని అతను ప్రేమించలేదు. అతనికి ఎలాంటి నారినయినా సరే ప్రేమించే శక్తిలేదు. అతను తన్ను పెళ్ళిచేసు కుంటానని అనటం ఒక్కకారణానికోసమే — తన ఆరాధనా, అభిమానం అతనిలోని ఓ దాహాన్ని తృప్తి పరుస్తున్నాయి. దుఃఖంలో పడి చనిపోయినా ఫర్వాలేదనుకుంటున్న ఓ ప్రాణికి జీవదానం చేశా నన్న భావనతో గర్వపడుతున్నాడు. అదీకాక అతన్ని ఎవరయినా ప్రాణమిచ్చేంతగా ప్రేమిస్తున్నారన్న ఆలోచన అతనికి సంతృప్తినిస్తోంది. అతను సెల్ఫ్ —సెంటర్డ్ మనిషి. అతనికి తన్ను తప్ప మరెవ ర్నయినా ప్రేమించే శక్తిలేదు. కాని తన్ను మరెవ రయినా గాఢంగా ప్రేమించాలన్న కోరిక మటుకు ఉంది.

'ఒక్కసారుగా ఇదంతా అర్థమయ్యేసరికి కమల తల తిరిగిపోయింది. అయితే అతని ఇంట్లో అతని బానిసలా ఉండటానికి ఓ ప్రాణి కావాలి. మనిషి అతన్ని ఆరాధించగలిగితే మరీమంచిది. ఎవర్నీ ఆక ర్షించలేని వ్యక్తి అయితే ఎలాంటి భయమూ అక్క ర్లేదు గనుక తన్ని ఎంచుకున్నాడు. పైగా కట్నం తీసుకోలేదన్న అభిమానంతో అతని మాటకు తను ఎదురు చెప్పలేనని అతని నమ్మకం.

'ఇంతకన్నా కట్నం పుచ్చుకుని పెళ్ళాడేవాడే నయం. ముందెంత బేరాలు చేసినా ఆ తరువాత భార్య అని గౌరవంతో నయినా చూస్తాడు. అలాకాక పోయినా కారుచీకట్లో చూడకుండా గోతిలో పడ వచ్చు. కాని తెలిసీ తెలిసీ ఇలాంటి మనిషిని పెళ్ళి చేసుకొని ఆ బందిఖానాలో ఎలా ఇరుక్కోనూ' అను కుంది కమల. అందుకనే వెంటనే అతనికి ఓ ఉత్తరం రాసింది.

"సూర్యం,

నీకు నాకన్నా అందమయిన అమ్మాయి నా పదిహేను వేల కట్నంతో దొరుకుతుంది. నువ్వలాంటి అమ్మాయిని పెళ్ళిచేసుకోవటమే ఉత్తమమని పిస్తోంది. అవునా? నాకు ఆలోచించే శక్తి, అభి మానించే హృదయం తప్ప మరేమున్నాయి చెప్పు? ఇలా ఏ ప్రత్యేకతా లేని నాతో నీకేం ఆనందం కలుగుతుందో నాకే తెలీటంలేదు. ఇక నా గురించి ఆలోచించటం మానేసి మరో అందమయిన లావ ణ్యవటంల్నో, సరోజినినో, అరుణనో పెళ్ళి చేసుకో. ఏ సుఖమే నాకు కావలసింది.

కమల".

వెంటనే అతని దగ్గరనుండి ముచ్చటగా నాల్గు వాక్యాలతో కూడిన ఓ ఉత్తరం వచ్చింది.

"నీ ఉత్తరాలన్నీ నాదగ్గర ఉన్నాయన్న విషయం మర్చిపోయినట్టున్నావు. నువ్వు మరెవర్నయినా పెళ్ళి చేసుకోటానికి ప్రయత్నిస్తే ఏం జరుగుతుందో



తెలుసుగా. మా నాన్నగారితో మాట్లాడుతాను. వచ్చే వేసంగిలో మన పెళ్ళవుతుంది.''

ఆ ఉత్తరం చదివిన కమల నిర్ఘాంతపోయింది. నువ్వు అక్కర్లేదు బాబోయ్' అంటున్న మనిషే గావాలంటాడు. ఇదేం పట్టుదల? పెళ్ళికాకముందే ఇలా ఉన్న తను పెళ్ళయ్యాక అతన్ని ప్రాణప్రదంగా అభిమానించ గలదని భావిస్తున్నాడా? అతను? కాని ఇక తను చేయగలిగిందేమిటుంది? అతను నాన్నగారికి ఆ ఉత్తరాల్లో ఏ ఒక్కదాన్ని చూపినా నాన్నగారు ఉగ్రస్వరూపులయిపోతారు. అమ్మ 'నీమీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేశావే'అని బాధపడుతుంది. మొత్తానికి తన మాట వినకుండా ఏడుపులా—పెడబొబ్బల మధ్య పెళ్ళి కానిచ్చేస్తారు. ఈ ఆలోచనల మధ్య పొగలమధ్య చిక్కుకున్న మనిషిలా ఉక్కిరిబిక్కిరయిపోయింది కమల. కాని ఆ పెళ్ళినుండి తప్పించుకునే మార్గమేదీ కనబడ లేదామెకు— ఒక్క ఆత్మహత్యతప్ప. ఓ రెండేళ్ళ క్రితం అయితే బహుశా అపనే చేసేదేమో. కాని అయ్యేదేదో కానీ అన్న మొండి ధైర్యంతో అలాగే నిర్లిప్తంగా ఉండిపోయింది కమల.

అతనన్నట్లుగానే వారి పెళ్ళి ఆ వేసంగిలో అయిపోయింది. సూర్యం తల్లిదండ్రులు మొదట్లో ఏమాత్రం కట్నంలేని ఈ సంబంధం వద్దని పట్టుబట్టినా ఎదిగిన కొడుకు మాట కెదురు చెప్ప లేక ఒప్పుకున్నారు. అనుకోకుండా కమల పెళ్ళి సమస్య ఇంత తేలిగ్గా తీరిపోవటంతో మహా సంతోషపడిపోయారు కమల తల్లిదండ్రులు.

సూర్యం పెళ్ళికి అతని స్నేహితులు చాలా మందే వచ్చారు. పెళ్ళిఅయిన మరుసటిరోజున సూర్యం ఉన్న గదిముందుగా వెడుతున్న కమలకు ఎవరో సూర్యాన్ని—

"ఇంత అందమూ చందమూలేని అమ్మాయిని ప్రేమించి—పెళ్ళి చేసుకుంటాననంటున్నావ్. కనీసం డబ్బయినా ఉందా?'' అనడగటం వినిపించింది. అతనేం జవాబు చెబుతాడోనని అక్కడేఆగి వినసాగింది.

"డబ్బూలేదూ, పాడూలేదు. నేనంటే పిచ్చి అభిమానం ఆ అమ్మాయికి. ఆ అమ్మాయి రాసిన ఓ ఉత్తరం చూశావుగా. నేనంటే పడి చస్తుంది. కాబట్టి నేనేం చేసినా అడ్డు చెప్పదు. నాకు అరుణా, మల్లికా, రాగిణి, సరోజినీలాంటి స్నేహితులున్నారని తెలిసినా ఏమీ చెయ్యలేదు. అదే కట్నం తెచ్చిన అమ్మాయైతే నామీద అధికారం చెలాయించటానికి చూస్తుంది. కమల నన్ను అలా దబాయించగలదా. ఇంట్లో కుక్కలా పడివుంటుంది భాయ్.'

సూర్యం మాటలు వింటూంటే కాళ్ళక్రింద భూమి కదిలిపోతున్నట్టుగా అనిపించింది. కష్టపడి వెనక్కితిరిగి తనగదికెళ్ళి పడుకుంది. సూర్యానికి తన గురించి ఉన్న అభిప్రాయం ఇచ్చితంగా తెలిసిపోయినది. ఇక ఎప్పటికయినా అతను తన్ను అభిమానించ గలడన్న ఆశ మొలకెత్తకుండానే చచ్చిపోయింది.

ఆ తరువాత ఆమె జీవితం అలాగే అతనన్నట్టుగానే కుక్క జీవితంలాగా గడిచిపోయింది. అతని తిరుగుళ్ళూ, తిట్లూ ఏవీ ఆమె మీద పనిచేసేవికావు. అతని మాటలన్నింటినీ ఓ కర్ర ముక్కలా, నిర్లిప్తంగా ఉదాసీనంగా వింటూ నిలబడేది. అతను ఎప్పుడయినా ఆమెని కొట్టటానికి చేయెత్తగా, అలాగే అదే ధిక్కారంతో, సంస్కారంలో నువ్వు నాకన్నా తక్కువ అన్న భావంతో అతని మొహంలోకి చూసేది. ఆ తిరస్కారం అతని చేతిని ఇక ముందుకు వచ్చేలా చేసేదికాదు.

ఎప్పుడయినా, ఎవరికయినా ఆమెను పరిచయం చేస్తూ "మాది ప్రేమ వివాహం'' అని అతను అన్నప్పుడు మాత్రం ఆమె శరీరం కోపంతో భగ్గుమని మండేది. 'ప్రేమ అంటే ఏమిటో ఇతనికి తెలీదు. నన్ను మరోదారిలేకుండా ట్రాప్ చేసి పెళ్ళి చేసుకున్నాడు' అని చాటి చెప్పాలనిపించేది.

కాని ఆమె చేయగలిగినదేమున్నది?

తలుపు దబాలున తోసిన చప్పుడు కావటంతో ఉలిక్కిపడింది కమల.

"ఇంకా అలాగే కూర్చున్నావేం? మొగుడు ఇంటికొచ్చేసరికి కాస్త శుభ్రంగా తయారయి ఎదురు రావాలన్న జ్ఞానం కూడా లేదేం? ఇంకెవత్తినయినా పెళ్ళి చేసుకుంటే డబ్బుకు డబ్బు వచ్చేది. ఇలాంటి జిడ్డు మొహాన్ని కాకుండా కొంచెం అందంగా ఉన్న పిల్లనయినా కట్టుకుంటే సుఖపడుదును. నా ఖర్మగాలి తగలడ్డావు'' అంటూ గాలి దుమారంలా లోపలికొచ్చాడు సూర్యం. అప్పటికే తలుపు దగిరికి వెళ్ళిన కమల ఒక్కక్షణం ఆగి "భోజనానికి కంచం పెడుతున్నా.'' అంది.